ప్రజల చేతిలో

www.ayudamdaily.com

# ఆయుధం

The Common People's Voice

ఆదివారం | ఆగస్టు 30, 2026 | సంపుటి : 7 | సంచిక : 79 | పేజీలు : 2





## పన్ను వసూళ్లలో వేగం పెంచండి

- బల్దియా కమిషనర్ వెంకన్న

2 లో

### సర్‌పై అభ్యంతరాలు, క్లెయిమ్‌ల

# గడువు పెంచండి

## సీఈసీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ



**హైదరాబాద్, ఆయుధం:**

సర్‌పై అభ్యంతరాలు, క్లెయిమ్‌ల గడువు పొడిగించాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. అక్టోబర్ 19తో గడువు ముగుస్తున్నందున మరో 4 వారాలు పెంచాలన్న సీఎం, సమీప భవిష్యత్తులో ఎలాంటి ఎన్నికలు లేనందున గడువు పెంచాలని కోరారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు రేవంత్ రెడ్డి లేఖ రాశారు.

**4 వారాల గడువు ఇవ్వాలి :**

ఎస్ఐఆర్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని తెలిపిన రేవంత్ రెడ్డి, ఓటర్ల పరిశీలనలో అనేక లోపాలు ఉన్నాయని ఆరోపించారు. ఇళ్లు మారితే నోటీసు ఇవ్వకుండా ఓట్లు తొలగించవద్దని కోరారు. గ్రామ, వార్డు సభల్లో ముసాయిదా ఓటరు జాబితా చదివించాలని, కనీసం రెండు సార్లు గ్రామ, వార్డు సభల్లో ఓటరు జాబితా చదివించాలని, నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు 4 వారాల గడువు ఇవ్వాలని సూచించారు.

**అదనపు ఈఆర్‌వోలను నియమించాలి**

పట్టణాల్లో పోలింగ్ బూత్‌ల వారీగా హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని రేవంత్ రెడ్డి కోరారు. మండల స్థాయి అధికారులు ఇచ్చే డాక్యుమెంట్‌నూ ఆమోదించాలని, హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో అదనపు ఈఆర్‌వోలను నియమించాలని లేఖలో పేర్కొన్నారు.



### హనుమకొండను

# స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

- క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- బ్యాడ్మింటన్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్

**హనుమకొండ, ఆయుధం:** విద్య, వైద్యంతో పాటు క్రీడారంగానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, హనుమకొండలో క్రీడా మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసి ఈ ప్రాంతాన్ని ప్రధాన క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ లో అభివృద్ధి చేసిన స్విమ్మింగ్ పూల్‌ను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, హనుమకొండ జిల్లా కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయ్ తదితరులతో, జేఎన్ఎస్ ఇండోర్ స్టేడియంలో పునర్నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న బ్యాడ్మింటన్ స్టేడియంను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పూలమాల వేశారు. (వివరాలు 2 లో..)

# ఫీజుల బకాయి బీజేపీ లడాయి

- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్
- విద్యార్థుల జీవితాలను ఆగం చేస్తున్న ప్రభుత్వం
- రూ.15 వేల కోట్ల ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి
- వరంగల్ చౌరస్తాలో బీజేవైఎం ఆధ్వర్యంలో నిరసన దీక్ష



**వరంగల్, ఆయుధం:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్ రావు పిలుపు మేరకు, రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసనల్లో భాగంగా వరంగల్ చౌరస్తాలో బీజేవైఎం వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో నిరసన దీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో రూ.15వేల కోట్ల ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోందని మండిపడ్డారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల జీవితాలు అంధకారంలో పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థను గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలించే అర్హత లేదన్నారు. కనీసం విద్యాశాఖ మంత్రి కూడా లేని ఏకైక దుస్థితి ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే ఉందంటూ ఆయన దుయ్యబట్టారు. విద్యార్థుల సమస్యలను పట్టించుకోని పక్షంలో ప్రభుత్వం తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల బకాయిలను వెంటనే విడుదల చేసే వరకు బీజేపీ (మిగతా 2 లో..)

### ప్రతీ గ్రామానికి గోదావరి

# జలాలు తీసుకొస్తా

## ప్రతీ ఎకరానికి రెండు పంటలకు సాగు నీరు



- 6నెలలో దేవాదుల పనులను పూర్తి చేసి పూర్తి ఆయకట్టుకు సాగు నీరు అందిస్తా
- బిఆర్ఎస్ చిల్లర రాజకీయాలు మానుకోవాలి
- జీవో 97 రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**స్టేషన్ ఘనపూర్, ఆయుధం:** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో దేవాదుల కింద ఉన్న రిజర్వాయర్ల ద్వారా ప్రతీ గ్రామానికి సాగు నీరు అందించాలనే ఏకైక ఎజెండాతో పని చేస్తున్నట్లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. స్టేషన్ ఘనపూర్ రిజర్వాయర్ కింద ఉన్న ఆయకట్టుకు పంట కాలువ ద్వారా ఎమ్మెల్యే కడియం శ్రీహరి సాగు నీరు విడుదల చేశారు. తూము వద్ద గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి పసుపు, కుంకుమ, పూలు సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రతీ ఎకరానికి రెండు పంటలకు సాగు నీరు అందించడమే లక్ష్యమని అన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా రిజర్వాయర్లలో నీటిని నింపేందుకు రెండు నెలలుగా ప్రతీ రోజు ఎప్పటికప్పుడు పంపింగ్ ను పరిశీలిస్తూ, అధికారులతో మాట్లాడుతూ గోదావరి నుండి నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లను నింపి రైతుల పంటలను కాపాడే ప్రయత్నం చేస్తున్నామని దానికి ఫలితాంగానే నేడు దేవాదుల కింద ఉన్న అన్ని రిజర్వాయర్ల నుండి సాగు నీరు విడుదల చేస్తున్నామని అన్నారు. 6నెలల్లో 100శాతం దేవాదుల పనులను పూర్తి చేసి నియోజకవర్గంలోని పూర్తి ఆయకట్టుకు సాగు నీరు అందిస్తానని స్పష్టం చేశారు. అందుకు రాజకీయాలకు అతీతంగా ప్రజలు, రైతులు, నాయకులు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. (మిగతా 2 లో..)



### చిన్న నీటిపారుదల వ్యవస్థ

# ఏర్పాటు చేయండి

- సీఎం రేవంత్‌కు వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ నివేదిక

**హైదరాబాద్, ఆయుధం:** రాష్ట్రంలో చిన్న నీటిపారుదల వ్యవస్థపై వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ప్రతినిధి బృందం సీఎం ఎ.రేవంత్ రెడ్డి ని కలిసి నివేదిక అందించింది. నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే సాంకేతిక యూనిట్లతో చిన్న నీటిపారుదల వ్యవస్థను తిరిగి ఏర్పాటు చేయాలని కమిషన్ తన నివేదికలో సూచించింది. తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండ రెడ్డి నేతృత్వంలో సభ్యులు రాములు నాయక్, రాంరెడ్డి గోపాల్ రెడ్డి, గంగాధర్, ఎం. భవానీరెడ్డి సీఎంను జూబ్లీహిల్స్ నివాసంలో కలిసి నివేదిక అందించారు. కమిషన్ సిఫారసులపై సీఎం వారితో చర్చించారు. పంటల మార్పిడి, ఉద్యానవన పంటల సాగు పెంపు, ఎఫ్‌పీవోల ఏర్పాటు వంటి అంశాలపై కమిషన్ దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో చిన్న నీటిపారుదల వ్యవస్థను మెరుగుపరచడానికి నివేదికలో కమిషన్ ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసింది. చిన్న, పెద్ద నీటిపారుదల వనరులను కలిపే కమాండ్ ఏరియా ఆధారిత నిర్వహణ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని సూచించింది. చెరువుల పరిరక్షణకు ప్రత్యేకంగా చిన్న నీటిపారుదల చట్టం రూపొందించాలని, చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ సరిహద్దులను తక్షణం గుర్తించి ఆక్రమణలను తొలగించి పరిరక్షించాలని సూచించింది. తెలంగాణలో నీటి భద్రత, వ్యవసాయ స్థిరీకరణ, గ్రామీణ జీవనోపాధుల అభివృద్ధికి చెరువుల పునరుద్ధరణ అత్యంత అవసరమని తెలిపింది. గడిచిన రెండేళ్ల కాలంలో రైతు కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వానికి అందించిన సూచనలను కమిషన్ ప్రతినిధి బృందం వివరించింది. కమిషన్ పనితీరుపై సీఎం సంతృప్తిని వ్యక్తం చేశారు.

### తెలంగాణ ఉద్యమకారుల రుణం తీర్చుకోవడం

## ప్రభుత్వ బాధ్యత: రేవంత్

**హైదరాబాద్, ఆయుధం:** తెలంగాణ ఉద్యమకారుల రుణం తీర్చుకోవడం ప్రభుత్వ బాధ్యత అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రితో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ భేటీ అయింది. కమిటీ సభ్యులు కేశవరావు, కోదండరామ్, రాములునాయక్, మోతె శోభన్‌రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీలతో జరిపిన సంప్రదింపుల వివరాలతో కూడిన నివేదికను సీఎంకు అందజేశారు. ఉద్యమకారుల గుర్తింపు కసరత్తును జాప్యం లేకుండా పూర్తి చేయాలని సీఎం వారికి సూచించారు. ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేసి డిజిటల్ దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇచ్చేందుకు, పింఛన్, హెల్త్‌కార్డులు, ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు సీఎం సానుకూలంగా ఉన్నట్లు కమిటీ వెల్లడించింది.




### నీట్(పీజీ) పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163

# బీఎన్ఎస్ఎస్ అమలు

- పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు
- పరిసరాలలో పోలీస్ పెట్రోలింగ్
- పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐ.పి. ఎస్

**హనుమకొండ, ఆయుధం:** వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఆదివారం నిర్వహించే నీట్ (పీజీ) పరీక్షల సందర్భంగా ఆయా పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు సెక్షన్ 163 BNSS యాక్ట్ 2023 అమలులో వుంటుందని పోలీస్ కమిషనర్ శ్వేత ఐపిఎస్ తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాలకు 500 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా వుండరాదని సూచించారు. ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఉరేగింపులు, దర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని పెర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచించారు. పరిక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు తో పాటు ట్రాఫిక్ ఆంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పకడ్బంది చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు.

ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

# వచ్చే నెల 4న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

- పార్టీలకు అతీతంగా ఉత్సవాలు
- కాళోజీ కళాక్షేత్రం వేదికగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంబరాలు
- యాదవ సంస్కృతీ, సంప్రదాయాలు తెలిపేలా కార్యక్రమాలు
- యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్, కుడా మాజీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ వెల్లడి
- గొల్ల, కురుమల సమక్షంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకల పోస్టర్ ఆవిష్కరణ




**హనుమకొండ, ఆయుధం:** సెప్టెంబర్ 4న శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో అత్యంత వైభవంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్, కుడా మాజీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ వెల్లడించారు. పార్టీలకు అతీతంగా ప్రముఖులు తరలిరానున్నారని, ప్రజలు ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హనుమకొండ రాంనగర్ లోని బీసీ భవన్ లో శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్ ను గొల్ల, కురుమలతో కలిసి సుందర్ రాజ్ యాదవ్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏటా శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నామని, ఈసారి కూడా అత్యంత వైభంగా ఉత్సవాలు జరుపుతామన్నారు. ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా శ్రీకృష్ణుని భజనలు జరుగుతున్నాయని, భగవద్గీత ప్రపంచానికే మార్గదర్శిగా మారిందని గుర్తు చేశారు. సెప్టెంబర్ 4న శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా యాదవుల సంస్కృతీ సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పేలా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, రాజ్యసభ సభ్యుడు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పార్టీలకు అతీతంగా హాజరవుతారన్నారు. ఉత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 4న మధ్యాహ్నం రెండు గంటలకు రాంనగర్ లోని బీసీ భవన్ నుంచి కాళోజీ కళాక్షేత్రం వరకు రథయాత్ర జరుగుతుందని, అనంతరం పవిత్రమైన గోపూజ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఆ తరువాత శ్రీకృష్ణ భగవానుడికి తొట్లు ఊపే కార్యక్రమం ఉంటుందని, యాదవ సంస్కృతికి అద్దం పట్టేలా సంబరాలు జరుగుతాయన్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే కళాకారులతో ఆటాపాట, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న యాదవులను ఏకం చేసి రాబోయే రోజుల్లో వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని సుందర్ రాజ్ యాదవ్ వివరించారు. పార్టీలు, కుల, మతాలకు అతీతంగా ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, జక్కుల శ్రీనివాస్ యాదవ్, తోట్ల రాజు యాదవ్, యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి రవీంద్ర కుమార్ యాదవ్, ఉపాధ్యక్షుడు కత్తుల సహదేవ్ యాదవ్, కార్యదర్శి తుత్తురు రవీందర్ యాదవ్, కోశాధికారి చిన్నాల రవీందర్ యాదవ్, అఖిలభారత యాదవ మహాసభ వరంగల్ జిల్లా అధ్యక్షుడు బొల్లెబోయిన కిషోర్ యాదవ్, అఖిలభారత యాదవ మహాసభ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మూగల కుమార్ యాదవ్, యాదవ మహిళ నాయకురాలు లలిత యాదవ్, కనకరాజు, ఇదుల మల్లయ్య, దూడయ్య, చెన్నమల్లు, పెద్దబోయిన నాగరాజు, ప్రమోద్, యుగేంధర్, వంశీ, కోటి, కందుల జీవన్, రమేష్, హరిప్రసాద్, రాణా, రాజయ్య, యశ్వంత్, నన్నెబోయిన రాజ్, వేల్పుల సాయి తదితరులు పాల్గొన్నారు.

# వరదల్లో కొట్టుకొచ్చిన 'లాకర్'..

### రూ.లక్షలు లూటీ చేసిన స్థానికులు

**(జాతీయం, ఆయుధం)**

నేపాల్‌లో ఆకస్మిక వరదలు సృష్టించిన విలయం తీరని నష్టాన్ని మిగిల్చింది. గ్రామాలకు గ్రామాలు కొట్టుకుపోవడంతో ప్రాణ, ఆస్తి నష్టం భారీగానే నమోదవుతోంది. విపత్తు వేళ బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం విరాళాలు సేకరిస్తున్న క్రమంలోనే ఓ విచిత్ర ఘటన చోటుచేసుకుంది. వరదల్లో ఓ బ్యాంకు లాకర్ కొట్టుకురాగా.. దాన్ని పగలగొట్టిన కొందురు వ్యక్తులు అందులో ఉన్న నగదును దోచుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు.. ఈ వ్యవహారానికి సంబంధించి 29 మందిని అదుపులోకి తీసుకున్నారు.

ధాడింగ్ జిల్లా పోలీసుల ప్రకారం.. రసువా జిల్లాలోని భోటే కోశి ప్రాంతంలో సంభవించిన వరదల్లో ఓ బ్యాంకు లాకర్ కొట్టుకువచ్చింది. అది ధాడింగ్ జిల్లాలోని నది తీరంలో ఓ చోట కనిపించింది. దానిని గుర్తించిన కొందరు స్థానికులు ఇళ్లకు తీసుకెళ్లి పగలగొట్టారు. అందులో ఉన్న నగదును తీసుకెళ్లిపోయారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. మొత్తం 29 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు రూ.50లక్షల నగదును (భారత కరెన్సీలో) స్వాధీనం చేసుకున్నారు.



# ఫీజుల బకాయి.. బీజేపీ లడాయి


(మొదటి పేజీ తరువాయి..)
ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఒకవైపు పాలిటెక్నిక్ విద్యార్థుల పట్ల, మరోవైపు ఆయుష్ వైద్య విద్యార్థుల పట్ల అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక వైఖరిని భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన వివాదాస్పద జీవో 97 వల్ల పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు, ఈసెట్ రాసే విద్యార్థుల భవిష్యత్తు తీవ్ర ఆందోళనలో పడిందని మండిపడ్డారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సింది పోయి, ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేలా విద్యా రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం బలహీనపరుస్తోందని ధ్వజమెత్తారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ కంటే తెలంగాణలో ఆయుష్ విద్యార్థులకు అత్యంత తక్కువ స్టైపెండ్ ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఎండగట్టారు. విద్యార్థుల న్యాయమైన సమస్యలపై పోరాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు ను అక్రమంగా గృహ నిర్బంధం చేయడం, నిరసనలను పోలీసు బలగాలతో అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమేనని దుయ్యబట్టారు.
ప్రభుత్వాలు మారినా విద్యార్థుల తలరాతలు మారలేదని, విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విద్యార్థుల కష్టాలు పట్టవా అని ప్రశ్నించారు. వెంటనే జీవో 97ను రద్దు చేయాలని, ఆయుష్ విద్యార్థుల డిమాండ్లను నెరవేర్చాలని, లేనిపక్షంలో విద్యార్థి లోకంతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచుతామని గంట రవికుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎర్రగొల్ల భరత్ వీర్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల శ్రవణ్, బీజేపీ నాయకులు ఆడేపు రవిరాము, రాళ్లబండి మున్నా, మహంత్, బాశెట్టి సాయి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బైరి నాగరాజు, ఓబిసి మోర్చా రాష్ట్ర నాయకులు కనుకుంట్ల రంజిత్ కుమార్, ఎరుకల రఘునారెడ్డి, బైరి శ్యాంసుందర్, రాయపురం కుమారస్వామి, పోనుగోటి వెంకట్ రావు, అంకాల జనార్ధన్, మహిళా మోర్చా అధ్యక్షురాలు తెకుమట్ల రేణుక, ఎస్సీ మోర్చా అధ్యక్షులు మదాసు రాజు, ఓబిసి మోర్చా అధ్యక్షులు కూచన క్రాంతి కుమార్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు దండు కిషన్, కర్నె రవీందర్, మెంతుల యాదగిరి, మార్తా ఉషారాణి, జీలకర్ర వీరస్వామి, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హనుమకొండను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

- క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- బ్యాడ్మింటన్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ ప్రారంభోత్సవం




**హనుమకొండ, ఆయుధం:** విద్య, వైద్యంతో పాటు క్రీడారంగానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, హనుమకొండలో క్రీడా మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసి ఈ ప్రాంతాన్ని ప్రధాన క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండలో అభివృద్ధి చేసిన స్విమ్మింగ్ పూల్‌ను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, హనుమకొండ జిల్లా కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయ్ తదితరులతో, జేఎన్ఎస్ ఇండోర్ స్టేడియంలో పునర్నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న బ్యాడ్మింటన్ స్టేడియంను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పూలమాల వేశారు. ఈ సందర్భంగా తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ హనుమకొండ జేఎన్ఐఎస్ ప్రెసిడెంట్ బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సభాధ్యక్షత జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారని అన్నారు. రెండున్నరేళ్లలో వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అన్ని రంగాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. జేఎన్ఎస్ లో కల్పించిన క్రీడా సదుపాయాలను సద్వినియోగం చేసుకొని అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని క్రీడాకారులకు సూచించారు. క్రీడాకారులకు అవసరమైన మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్పోర్ట్స్ స్కూల్‌కు సొంత భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, త్వరలోనే ఏర్పాటుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. వరంగల్ క్రీడాకారులకు పుట్టినిల్లుగా గుర్తింపు పొందిందని, ఈ ప్రాంతానికి చెందిన అనేక మంది క్రీడాకారులు గతంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి గుర్తింపు తీసుకువచ్చారని అన్నారు. ప్రస్తుత తరం క్రీడాకారులు కూడా క్రమశిక్షణ, పట్టుదలతో శిక్షణ పొంది ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ, క్రీడాకారుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. జేఎన్ఎస్‌లో ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ లలో క్రీడా వసతులను మెరుగైన ప్రమాణాలతో అభివృద్ధి చేశామని తెలిపారు. క్రీడాకారులు ఈ సదుపాయాలను తమ సొంత ఆస్తిగా భావించి సద్వినియోగం చేసుకోవడంతో పాటు వాటి పరిరక్షణకు కూడా సహకరించాలని సూచించారు. హనుమకొండ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కొత్త ప్రశాంత్ మాట్లాడుతూ దాదాపు కోటిన్నర రూపాయలతో బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ పునర్నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. స్విమ్మింగ్ పూల్ ప్రారంభించిన అనంతరం స్పోర్ట్స్, స్విమ్మింగ్ అకాడమీ క్రీడాకారులు స్విమ్మింగ్ చేయగా ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్లు పరిశీలించారు. బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, ఏసిపి జితేందర్ రెడ్డి, బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి బ్యాడ్మింటన్ ఆడారు. బ్యాడ్మింటన్ వెటరన్ క్రీడాకారులు రమణయ్య, కైలాసం లను ఎమ్మెల్యే కలెక్టర్ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జూడో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కైలాస్ యాదవ్, ఆఫీసర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్, ఏసీపీ జితేందర్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ హనుమకొండ ప్రధాన కార్యదర్శి రమేష్‌రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ లో చేరిన ఎల్లారెడ్డిగూడెం సర్పంచ్

**హనుమకొండ, ఆయుధం:** రఘునాథపల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ గడ్డం జోజి, వార్డు మెంబర్ ఎల్లయ్య, మరో 30మంది నాయకులు, కార్యకర్తలు స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. హన్మకొండ లోని ఎమ్మెల్యే కడియం శ్రీహరి క్యాంప్ కార్యాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు లింగాల జగదీష్ రెడ్డి, రఘునాథపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షతులై కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు జరుగుతున్నాయని అన్నారు. నియోజకవర్గంలో ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవడంతో పాటు కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్లామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లింగాజీ, కోళ్ల రవి, మేకల నరేందర్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ గ్రామానికి గోదావరి జలాలు తీసుకొస్తా

(మొదటి పేజీ తరువాయి..)
ఘనపూర్ రిజర్వాయర్ కింద పూర్తి ఆయకట్టుకు రెండు పంటలకు సాగు నీరు అందించే బాధ్యత నాదని హామీ ఇచ్చారు.



## బీఆర్ఎస్ చిల్లర రాజకీయాలు మానుకోవాలి

10ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో తెలంగాణను ఏ రకంగా దోచుకుందో, తెలంగాణను ఏ రకంగా భ్రష్టు పట్టించిందో ప్రజలందరికి తెలుసని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ప్రారంభించి పూర్తి చేశారని ఆ తర్వాత నాణ్యత లోపం వల్ల మెడిగడ్డ కుంగిపోయిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి మెడిగడ్డ నుండి 1టీఎంసి కూడా ఎత్తిపోయకుండా వరుసగా రెండు సంవత్సరాలు దేశంలోనే అత్యంత ఎక్కువ ధాన్యం దిగుబడి సాధించిన రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం నిలిచిందని గుర్తుచేశారు. బిఆర్ఎస్ నాయకులు ధరణిని అడ్డుపెట్టుకొని ప్రభుత్వ భూములు, అసైండ్ భూములు, ప్రయివేట్ భూములను కోళ్లగొట్టారని, వందల ఎకరాలను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెట్టి వేల కోట్ల ఆస్తులు సంపాదించారని ఆరోపించారు. బీఆర్ఎస్ ఇప్పటికైనా చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవుపలికారు.

## జీవో 97ను రద్దు చేయాలి.

గతంలో విద్యా శాఖ మంత్రిగా పని చేసిన వ్యక్తిగా జీవో 97ను వెంటనే రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి గారిని ప్రత్యేకంగా కోరారు. పాలిటెక్నీక్ విద్యార్థులను ఇంజినీరింగ్ నుండి లేబర్ డిపార్ట్మెంట్ కు అనుసంధానం చేయడం విద్యార్థులకు ఇష్టం లేదని అన్నారు. ప్రభుత్వ ఆలోచన మంచిదే అయినప్పటికీ విద్యార్థులు అందుకు ఒప్పుకోవడం లేదని,, విద్యార్థుల ఆందోళనలు, అపోహలు దృష్టిలో పెట్టుకొని జీవో 97 ను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. పాలిటెక్నీక్ విద్యాపై దేశ వ్యాప్తంగా ఏ పద్ధతి కొనసాగుతుందో అదే పద్ధతిని తెలంగాణ రాష్ట్రంలోనూ కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బల్దే వెంకన్న, మండల పార్టీ అధ్యక్షుడు జూలూకుంట్ల శిరీష్ రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు అంబాటి కిషన్ రాజ్, కౌన్సిలర్లు, గ్రామాల సర్పంచులు, నాయకులు, పాల్గొన్నారు.



# అనాథ పిల్లలకు 25 ఏళ్లుగా సేవలు

- కూనూరు యుగంధర్‌కు గౌరవ డాక్టరేట్

**వరంగల్, ఆయుధం:** 25 సంవత్సరాలుగా అనాథ పిల్లలకు ఉచిత విద్య, వైద్య సేవలు అందిస్తూ సామాజిక సేవలో విశేష కృషి చేస్తున్న కూనూరు యుగంధర్‌కు అమెరికన్ విజ్డమ్ పీస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్ అవార్డు లభించింది. తమిళనాడు రాష్ట్రంలోని హుస్సూర్ పట్టణంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో యుగంధర్ ఈ గౌరవాన్ని అందుకున్నారు. అమెరికన్ విజ్డమ్ పీస్ యూనివర్సిటీ సీఈఓ డాక్టర్ ఎల్జిబిత్ థామస్, ప్రొప్రైటర్ జాన్ విల్సన్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. సామాజిక సేవా రంగంలో యుగంధర్ అందిస్తున్న సేవలను గుర్తించి ఈ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా సామాజిక సేవా రంగంలో అందించిన సేవలకు గుర్తింపుగా ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అవార్డును వరంగల్ జిల్లా సహకార శాఖ అధికారి డాక్టర్ బి. సంజీవ్ రెడ్డి, డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో గాలి మధు యాదవ్, అరుణ్ కుమార్, శ్రీరామ్, కరుణాకర్ స్వామితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.




# కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న మోడీ ప్రభుత్వం

- ఏఐటీయూసీ మహాసభలను జయప్రదం చేయండి
- సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి

**హనుమకొండ, ఆయుధం:** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తోందని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి విమర్శించారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఎఐటియుసి రాష్ట్ర 4వ మహాసభల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యానికి పూర్వమే 1920 అక్టోబర్ 31న ఎఐటియుసి ఆవిర్భవించిందని, నాటి నుంచి నేటి వరకు కార్మికుల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి 44 కార్మిక చట్టాలను సాధించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే 'వ్యాపారం సులభతరం' పేరుతో 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని ఆరోపించారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 6 నుంచి 8వ తేదీ వరకు కరీంనగర్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు, ఈ రాష్ట్ర మహాసభలను కార్మిక లోకం అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ ఎ స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శులు గుంటి రాజేందర్, కర్రె బిక్షపతి, నాయకులు పూజారి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పన్ను వసూళ్లలో వేగం పెంచండి

- బల్దియా కమిషనర్ వెంకన్న
- టాప్ డిఫాల్టర్ల పై ప్రత్యేక దృష్టి సారించి వసూళ్లు చేపట్టాలి
- పన్ను బకాయిల వసూళ్లకు కఠిన చర్యలు తీసుకోండి




**వరంగల్, ఆయుధం:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆస్తి పన్నుల వసూళ్లకు నిర్దేశించిన లక్ష్యాల సాధనలో మరింత వేగం పెంచాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ట్యాక్సేషన్, రెవెన్యూ అధికారులతో ఆయన సర్కిల్‌ల వారీగా పన్నుల వసూళ్ల పురోగతిని సమీక్షించారు. ఆస్తి పన్నుల వసూళ్లు, కొత్త నిర్మాణాల గుర్తింపు, ప్రభుత్వ భవనాల రీఅసెస్‌మెంట్, కమర్షియల్, నాన్ కమర్షియల్ భవనాల పన్నుల విధింపు, ఆన్ కలెక్టబుల్ డిమాండ్లు, డబుల్ అసెస్‌మెంట్లు, వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ (VLT), ప్రాపర్టీ రివిజన్ తదితర అంశాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.
పన్నుల వసూళ్ల లక్ష్యాలను సర్కిల్, వార్డు స్థాయిలో విభజించి, రోజువారీ పురోగతిని తప్పనిసరిగా పర్యవేక్షించాలని సూచించారు. కొత్త అసెస్‌మెంట్లు, పెండింగ్ బకాయిలు, వీఎల్‌టీ, డబుల్ అసెస్‌మెంట్లు, కమర్షియల్ భవనాల గుర్తింపు తదితర అంశాలపై రెవెన్యూ సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. పన్నుల అసెస్‌మెంట్, వసూళ్ల ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించాలని తెలిపారు.
అపార్ట్‌మెంట్ల నిర్మాణం కోసం డిస్మాంటిల్ చేసిన భవనాలకు సంబంధించిన పాత హౌస్ నంబర్లను గుర్తించి, పూర్తి వివరాలను వెంటనే సమర్పించాలని ఆదేశించారు. ఈ వివరాలను ఉప కమిషనర్లు మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి, తుది నివేదికను సమర్పించాలని సూచించారు. పెద్ద మొత్తంలో పన్ను బకాయిలు ఉన్న డిఫాల్టర్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ ఆదేశించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిల వసూళ్లకు ఆర్ఆర్ చట్టం ప్రకారం చర్యలు చేపట్టేందుకు వివరాలను సమర్పించాలని తెలిపారు. నగర పరిధిలోని ప్రతి ప్లాట్‌ను గుర్తించి నిబంధనల ప్రకారం వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ (VLT) వసూలు చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. పన్నుల వసూళ్లలో వెనుకబడిన సర్కిళ్లు, వార్డులను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, అవసరమైన చోట్ల ప్రత్యేక బృందాలతో క్షేత్రస్థాయిలో పర్యటించి బకాయిలను సేకరించాలని సూచించారు.
నిర్దేశిత లక్ష్యాలను సాధించడంలో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్య సాధన దిశగా సిబ్బందిని సమన్వయం చేయాలని ఆదేశించారు. పన్ను వసూళ్ల లో వృద్ధిని పెంచడానికి త్వరలోనే వార్డు ఆఫీసర్ లు బిల్ కలెక్టర్ లు,రెవిన్యూ అధికారులతో సమన్వయం సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని,ఆస్తి పన్ను తో సమాంతరం గా నీటి పన్ను బకాయి లపై దృష్టి సారించాలని ఈ సందర్భం గా కమిషనర్ అన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్లు బిర్రు శ్రీనివాస్, ప్రసన్నరాణి, ట్యాక్సేషన్ అధికారి రామకృష్ణ, ఐటీ మేనేజర్ రమేష్, రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.



# ఢిల్లీ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

- ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ

**హనుమకొండ, ఆయుధం:** యువత సమస్యలపై ఢిల్లీ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) 2వ హనుమకొండ జిల్లా మహాసభ ఘనంగా జరిగింది. కేతపాక ప్రసాద్, పసునూరి సునీల్, తాటికంటి మమత అధ్యక్షత వహించగా డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి హాజరై ముందుగా ఎఐవైఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఇటీవల ఢిల్లీలో యువత చేపట్టిన పోరాట స్ఫూర్తితో దేశవ్యాప్తంగా యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ఎఐవైఎఫ్ ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా యువత 20 రోజుల పాటు ఢిల్లీలో స్వచ్ఛందంగా ఆందోళన నిర్వహించడంతో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం దిగివచ్చి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను రాజీనామా చేయించిందని, ఇది దేశ యువత సాధించిన విజయమని అన్నారు. అదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎఐవైఎఫ్ కార్యకర్తలు, నాయకులు యువత సమస్యలపై నిరంతర పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలోని యువతీ యువకులు హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు సిద్ధం కావాలని అన్నారు.

## నూతన జిల్లా కమిటీ ఎన్నిక

ఈ సమావేశంలో ఎఐవైఎఫ్ హనుమకొండ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా నోముల కిశోర్ ను, జిల్లా కార్యదర్శి గా గిన్నారపు రోహిత్ ను, ఉపాధ్యక్షులుగా కేతపాక ప్రసాద్, పసునూరి సునీల్, మర్రి విజయ్ లను, సహాయ కార్యదర్శులుగా గుగులోత్ సురేష్, పల్లకొండ శ్రీకాంత్, పెనుకుల మధు లను, కోశాధికారిగా తాటికంటి మమత లతో పాటు మొత్తం జిల్లా కమిటీ సభ్యులను 29 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి అభినందనలు తెలియజేశారు. ఈ సమావేశంలో సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, పాల్గొన్నారు.

# కేదాశి సంతాప సభ

**వరంగల్, ఆయుధం:** రంగసాయిపేట లో ఇటీవల మృతి చెందిన కేదాసి సుదర్శన్ సంతాప సభ ఆయన కుమారులు ప్రవీణ్ కుమార్, రాజేష్ టింకు నిర్వహించారు. ఈ సంతాప సభలో రంగసాయి పేట SSC 1990,1991 హై స్కూల్ బ్యాచ్ విద్యార్థులు బూర సంతోష్ కుమార్, పూల మల్లికార్జున్, వనం రామకృష్ణ, కాకతీయ సేవా సమితి అధ్యక్షులు మండల నరసింహ రాములు, ఎర్ర సాంబయ్య, ధారబోయిన శ్రీను, అడుప రాజ్ కుమార్, కోక సత్యనారాయణ, మానుపాటి సాంబయ్య, పుప్పాల సుధాకర్, దూడ రవి, మైదం రాకేష్, ఆరెపెల్లి ఎల్లయ్య, సుతారి సురేష్, కాకతీయ సేవా సమితి సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించి, సుదర్శన్ చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో స్విమ్మర్ అధ్యక్షుడు శేర్ల అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి తాడెం కుమార్, శంకేసి వెంకటేశ్వర్లు, అడ్డగట్ల జ్ఞానేశ్వర్, మునుకుంట్ల రాములు, కోరే రవి, రమేష్, విలాసాగరం శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి

- జి.జే.సి. ప్రిన్సిపాల్ నాముని పావని కుమారి



**జనగామ, ఆయుధం:** విద్యార్థులందరూ కూడా క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని ప్రిన్సిపాల్ పావని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పావనికుమారి పేర్కొన్నారు. జనగామ(ధర్మకంచ) ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ నాముని పావని కుమారి అధ్యక్షతన మరియు క్రీడా ఇంచార్జి రవిప్రసాద్ ఆధ్వర్యంలో భారత హాకీ మాంత్రికుడు, ది మెజీషియన్ మేజర్ ధ్యాన్ చంద్ 121 వ జయంతిని, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మేజర్ ధ్యాన్ చంద్ హాకీ క్రీడా ద్వారా భారత్ కు ఒలింపిక్స్ లో మూడు బంగారు పథకాలు సాధించాడని, భారత ప్రభుత్వం పద్మ భూషణ్ ద్వారా అతనిని సత్కరించిందని తెలుపుతూ విద్యార్థులందరూ కూడా క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని ప్రిన్సిపాల్ పావని సూచించారు. కళాశాల క్రీడా ఇంచార్జి మరిపెల్ల రవి ప్రసాద్ మాట్లాడుతూ యువత అన్ని రంగాలలో ముందుండాలని క్రీడలు శారీరక మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోదపడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల స్టాఫ్ సెక్రటరీ వై.శ్రీకాంత్ రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ వస్కుల శ్రీనివాస్, డాక్టర్ వరుధిని, గణేష్, తిరుమలేష్, ఇశ్రాత్ భాను, రజిత, ప్రియదర్శిని, రేఖ, కరుణాకర్, నాగేందర్, కాపర్తి శ్రీనివాస్, సురేష్, జ్యోతి, సబిహా బేగం అ, నాజిన్ అధ్యాపకేతర బృందం ప్రసన్న, శ్రీనివాస్, రవి, విద్యార్థులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695